
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట 5

శుక్రవారం 8 నవంబరు 2024

చేర్యాల మున్సిఫ్ కోర్టుకు

27 పోస్టులు

త్వరలో అందుబాటులోకి సేవలు

చేర్యాల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కొన్ని నెలల క్రితం చేర్యాలకు మున్సిఫ్ కోర్టు మంజూరు చేసిన నేపథ్యంలో సేవల నిర్వహణకు 27 మంది సిబ్బందిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవోఆర్‌టీ నం.128 ప్రకారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జూనియర్ సివిల్ జడ్జి, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్-7, టైపిస్ట్-2, ఫీల్డ్ అసిస్టెంట్-3, ఎగ్జామినర్, కాపీయిస్ట్, ప్రాసెస్ సర్వర్-3, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్-5 పోస్టులు మంజూరు చేసింది. ఆయా పోస్టుల నియామక ప్రక్రియ చేపట్టిన క్రమంలో మరి కొద్దిరోజుల్లోనే కోర్టు సేవలు అందుబాటులోకి రానున్నాయి. చేర్యాల, కొమురవెల్లి మండలాలను సిద్దిపేట రెవెన్యూ, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు హుస్నాబాద్ రెవెన్యూ పరిధిలో చేర్చడంతో కోర్టుల విషయంలోనూ తలా ఓ ప్రాంతానికి వెళ్తూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్ చొరవతో కొన్నినెలలక్రితం చేర్యాలకు మున్సిఫ్ కోర్టును మంజూరు చేయించారు. ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని కేటాయించడంతో ఫర్నీచర్, ఇతరత్రా ఏర్పాట్లు చేపట్టినప్పటికీ, ప్రత్యామ్నాయచర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంతో సిబ్బంది నియామకంలో జాప్యం జరిగింది. ప్రస్తుతానికి అడ్డంకులు తొలగడంతో పోస్టులు మంజూరవడం, త్వరితగతిన సిబ్బందిని నియమించనుండటంతో ఈనెలాఖరులోపు కోర్టు సేవలు ప్రారంభంకానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోర్టు సేవల ప్రారంభ విషయమై కొమ్మూరి, పల్లా హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎవరికి వారు కృషిచేసిన నేపథ్యంలో ఎట్టకేలకు సిబ్బంది నియామకం జరిగింది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు క్రెడిబులిటీ తమదంటే తమదంటూ పోటీ పడుతున్నారు.



కోతి చేష్టలు

పంటను కాపాడుకోవడానికి రైతులు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నికావు.. అయితే, ఇప్పుడు కోతులు కూడా వారిని కష్టాలకు గురిచేస్తున్నాయి. ఏదీ వదలని వానరాలు ధాన్యం కుప్పలపై పడి తింటున్నాయి. కొండపాక మండలం సిరిసనగండ్ల శివారులో రైతులు పోసిన వడ్ల కుప్పలపై కోతులు తిరుగుతూ రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

- కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)

వానరం అడ్డొచ్చి ప్రమాదం

- బైక్ పైనుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి



చేర్యాల : రోదిస్తున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు (ధర్మారెడ్డి మృతదేహం)

చేర్యాల, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : వానరం అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన గురువారం చేర్యాల పట్టణ శివారులో చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం వేచరేణికి చెందిన పర్పాటకం ధర్మారెడ్డి(49) చుంచనకోట ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజువారీ విధి నిర్వహణలో భాగంగా గురువారం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బండపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో ఓ వానరం అకస్మాతుగా పరిగెత్తుకుంటూ వాహనానికి అడ్డొచ్చింది. వాహనం అదుపుతప్పి ధర్మారెడ్డి కిందపడిపోయాడు. బలమైన గాయాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెం దా డు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి భార్య శకుంతల మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన ధర్మారెడ్డి మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు.

కోతుల దాడిలో టీచర్‌కు గాయాలు

తొగుట : కోతుల దాడిలో ఉపాధ్యాయుడికి గాయాలైన సంఘటన తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటలోని సయ్యద్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.వెంకటనర్సింలు ఉద యం పాఠశాలకు బైక్‌పై వెళ్తున్నాడు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఒక్కసారిగా కోతులు దాడిచేసి అతడిని తీవ్రంగా గాయపర్చాయి. కోతులతో ప్రతీరోజూ ఇబ్బందిగా ఉందని చెప్పారు. కోతులు కరవడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ కొట్టాడని మనస్తాపం..

యువకుడి ఆత్మహత్య

- ఒంటికి నిప్పంటించుకుని అఘాయిత్యం
- మెదక్ జిల్లా రాంపూర్‌లో ఘటన
- ఆర్థిక ఇబ్బందులే కారణమంటూ తొలుత ఫిర్యాదు
- సూసైడ్ నోట్ దొరకడంతో విషయం వెలుగులోకి..



తలారి కిషన్ (ఫైల్)

అల్లాదుర్గం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఓ పోలీసు కానిస్టేబుల్ అకారణంగా తనని కొట్టాడని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని కాలిన గాయాలతో ప్రాణాలు కోల్పోయాడు. ఆర్థిక సమస్యల వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు సహా అంతా భావించగా.. అతని ద్విచక్రవాహనంలో దొరికిన సూసైడ్ నోట్‌తో అసలు విషయం బయటపడింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం పరిధి రాంపూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంపూర్‌కు చెందిన తలారి కిషన్ (32) తన ఫోన్ పోయిందని రెండు రోజుల క్రితం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ చేస్తామని చెప్పి పంపారు. అయితే, తమ గ్రామంలోని ఎస్సీ సామాజిక భవనం వద్ద బుధవారం సాయంత్రం కిషన్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కిషన్‌ను తొలుత జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్ మరణించాడు. అయితే, ఆర్థిక ఇబ్బందుల వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని కిషన్ భార్య రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో కిషన్ మరణవార్త విని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన అతని సోదరుడు ప్రభాకర్‌కు కిషన్ ద్విచక్ర వాహనంలో గురువారం సూసైడ్ నోట్ దొరికింది. సాయిలు అనే కానిస్టేబుల్ కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని అందులో రాసి ఉంది. దీంతో కిషన్ కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. సీఐ, ఎస్సై న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఆందోళన విరమించలేదు. చివరికి మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఫోన్ కాల్‌లో ఇచ్చిన హామీతో శాంతించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

సమగ్ర కుటుంబ సర్వేకు

ప్రజలు సహకరించాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్
- పలు వార్డుల్లో సర్వే పరిశీలన

8

ఏ రిజర్వేషన్ ఎటో!

- స్థానిక నేతలకు కులగణన తంటా
- నిన్నటి వరకు పోటీపై ఆశలు
- రిజర్వేషన్ మారితే పరిస్థితి ఎంటన్న డైలమా
- వేచి చూసే ధోరణిలో ఆశావహులు
- జిల్లా పరిషత్‌పై 'చెరుకు'..'సోలిపేట' కన్ను

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన గ్రామాల రాజకీయ రూపురేఖలను మార్చేస్తుందా అంటే స్థానిక నేతలు అవుననే అంటున్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న పంచాయతీ, మున్సిపల్ చట్టాలకు చరమగీతం పాడి.. కుల గణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటివరకు పోటీలో ఉంటామని భావిస్తున్న నేతలంతా రిజర్వేషన్లు ఎవరికి అనుకూలిస్తాయో అన్న ఆందోళనలో పడిపోయారు.

-దుబ్బాక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి)



దుబ్బాక నియోజకవర్గంలో ఎనిమిది మండలాలు ఉండగా, ఇందులో అక్బర్‌పేట-భూంపల్లి కొత్తగా ఏర్పాటైంది. ఈ నియోజకవర్గం మినహాయిస్తే మిగిలిన మండలాల్లో పదేళ్ల పాటు పాత రిజర్వేషన్లే ఉంటాయని పలువురు నేతలు పోటీకి సిద్ధపడుతూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కులగణన ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చురుకుగా పాల్గొన్న నాయకులంతా ఇప్పుడు కులగణన, రిజర్వేషన్ల కేటాయింపు తర్వాతే ఆలోచిద్దాం...అన్న ధోరణిలో పడిపోయారు.

దుబ్బాక మండలంలో జడ్పీటీసీ స్థానం ఓసీ జనరల్, ఎంపీపీ స్థానం ఓసీ మహిళా రిజర్వేషన్‌లుండేవి. మిరుదొడ్డి మండలంలో జడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళ, ఎంపీపీ ఎస్సీ జనరల్, దౌల్తాబాద్ మండలంలో జడ్పీటీసీ బీసీ మహిళ, ఎంపీపీ ఓసీ మహిళ, తొగుట జడ్పీటీసీ ఓసీ జనరల్, ఎంపీపీ ఓసీ మహిళ, రాయపోల్ మండలంలో జడ్పీటీసీ బీసీ జనరల్, ఎంపీపీ బీసీ మహిళ, చేగుంట మండలంలో జడ్పీటీసీ ఓసీ జనరల్, ఎంపీపీ బీసీ జనరల్, నార్సింగ్ జడ్పీటీసీ ఓసీ జనరల్, ఎంపీపీ బీసీ మహిళ రిజర్వేషన్ ఉంది. ఇక అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి ఎన్నికలు జరుగలేదు.

దుబ్బాకలో పోటాపోటీ...

దుబ్బాక మండలం నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి జడ్పీటీసీ జనరల్ అయితే, జనరల్ అభ్యర్థులతో పాటు బీసీలు సైతం పోటీకి సై అంటున్నారు. ఇక జడ్పీచైర్మన్ స్థానం ఎస్సీ రిజర్వేషన్ అయితే ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్లు సమచారం. కాంగ్రెస్, బీజేపీ నుంచీ ఆశావహుల లిస్ట్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అన్ని పార్టీల నుంచి ఆశావహులు రిజరేషన్లు ఖరారు కాగానే రంగంలోకి దిగాలనే ఉద్దేశంతో ఉన్నారు.

స్థానిక బరిలో చెరుకు, సోలిపేట

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి దివంగత మాజీ మంత్రి

మిగతా 8వ పేజీలో...



హుస్నాబాద్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిరస్థాయిగా గుర్తుండేలా అభివృద్ధి

- హుస్నాబాద్ మున్సిపాలిటీలో 'ఉపాధి హామీ'కి కృషి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. హుస్నాబాద్ గ్రామీ ణ, పట్టణ వాతావరణం కలిగిన మున్సిపాలిటీ అని, ఉపాధి హామీ పథకం ఇక్కడ కూడా ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డితో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. హుస్నాబాద్‌లో 2006లో ఎనిమిది రేషన్‌షాపులు ఉంటే 2024లో కూడా ఆ సంఖ్య అలాగే ఉండడం దురదృష్టకరమన్నారు. కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశా రు. కొత్తపల్లి హుస్నాబాద్ నాలుగు లేన్ల రహదారి, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, రైతుబజార్, ఆర్డీవో కార్యాలయ నిర్మాణం, స్టేడియం, ఏసీపీ, మున్సిపల్ నూతన కార్యాలయ భవనం వంటి అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి లేదా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ప్రారంభించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. బుడిగ జంగాల కాలనీని అభివృద్ధి చేస్తామని, ఇందిరమ్మ విగ్రహాన్ని కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ మనుచౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, కోమటి స్వర్ణలత ఉన్నారు.

ఇండస్ట్రియల్ పార్కు స్థల పరిశీలన

అక్కన్నపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికే ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండలం చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

తూకంలో మోసం.. రైతుల రాస్తారోకో

మిరుదొడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు అధిక తూకం వేసి రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మిరుదొడ్డి మండలం అల్వాల చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఓవ్యాపారి రైతుల నుంచి 65 కిలోల బస్తాలో 70కిలోల వరకు అదనంగా తూకం వేస్తున్నాడని, అనుమానం వచ్చి సమీపంలోని ధర్మకాంటాలో తూకం వేయగా 5 కిలోల మేర తేడా గమనించినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతోనే దళారులను ఆశ్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి రాస్తారోకోను విరమించారు. అనంతరం ఆ వ్యాపారిపై మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో రైతులు పిర్యాదుచేశారు.



మిరుదొడ్డి మండలం అల్వాల చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

వింటర్

వ్యాధులు ఎంటర్!

- ఉదయం వేళల్లో మంచు
- క్రమంగా పెరుగుతున్న చలి
- వ్యాధులు ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

7

చెట్లపై గొడ్డలి వేటు

- అక్రమంగా నరికివేస్తున్న వైనం
- బొగ్గుల తయారీకి, ఇటుక బట్టీలకు, సామిల్ల విల్లులకు తరలుతున్న కలప

8

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకూడదు

- కలెక్టర్ మనుచౌదరి
- బస్వాపూర్‌లో కొనుగోలు కేంద్రం సందర్శన
- సమస్యలను ఏకరువు పెట్టిన రైతులు

కోహెడ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కోహెడ మండలంలోని బస్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. చుట్టూ పక్కన గల చిన్న చిన్న గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, ఇక్కడ మాత్రం వేగంగా కొనుగోళ్లు జరగడం లేదన్నారు. అలాడే ప్యాడీక్లీనర్లు నాలుగు మాత్రమే ఉన్నాయని, వాటికి సరిపడా విద్యుత్ అందక వైరు కాలిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో టార్పాలిన్ కవర్లు, సంచులు కుట్టడానికి తాళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. తేమశాతం రాగానే లారీల్లో ఎక్కించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ లైన్ విషయంలో ఏఈ వచ్చి కెపాసిటీ ప్రకారం కరెంటు సౌకర్యం కల్పిస్తారని, రాత్రివేళల్లో ధాన్యం వద్ద ఉండేందుకు స్ట్రీట్‌లైట్లు వేస్తామని చెప్పారు. తేమశాతం రాగానే వేగంగా లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టార్పాలిన్ కవర్లు, తాళ్లు తప్పనిసరిగా సెంటర్ ఇన్‌చార్జులు అందించాలని కలెక్టర్ తెలిపారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని అమ్ముకునేలా ప్రతీ ఒక్క అధికారి పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, సెంటర్ ఇన్‌చార్జులు ఉన్నారు.



కోహెడ మండలం బస్వాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

రెండు నెలల క్రితం అదృశ్యమైన మహిళ హత్య

● పోలీసులు దర్యాప్తుతో వెలుగులోకి..

● అదుపులో ముగ్గురు అనుమానితులు

నర్సాపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం అదృశ్యమైన ఓ మహిళా నల్లవల్లి అటవీ ప్రాంతంలో హత్యకు గురైన ఘటన నర్సాపూర్ పరిధిలో వెలుగుచూసింది. సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం మండల పరిధి ఎల్లారెడ్డిగూడతండాకు చెందిన శాంత(40) నర్సాపూర్‌కు కూరగాయల కోసం వెళ్లి అదృశ్యమైంది. అప్పట్లో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మహిళ అదృశ్యంగా కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గురువారం ముగ్గురు అనుమానితులను పట్టుకుని విచారించగా హత్య గురైనట్లు తెలిసింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీప్రాంతంలో హత్య చేసి అక్కడే వదిలేసివచ్చినట్లు నిందితులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడ మృతురాలి దుస్తులు మాత్రమే లభించాయి. ఎల్లారెడ్డిగూడతండాకు చెందిన నిందితులు అరుణ, కొండాపూర్‌కు చెందిన వెంకటయ్య, శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులో తీసుకుని హత్యకు గల కారణాలను విచారిస్తున్నారు. పూర్తి వివరాలు శుక్రవారం తెలుపుతామని సీఐ పేర్కొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం, ఒకరి అరెస్టు

నారాయణఖేడ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బైక్‌పై ఎండు గంజాయిని రవాణా చేస్తూ ఒకరు పట్టుబడ్డారు. టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ తెలిపిన వివరాలు ప్రకారం.. అబ్బెంద సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద గురువారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేస్తుండగా, కిషన్‌నాయక్ తండాకు చెందిన కర్రగోపాల్ బైక్‌పై వస్తుండగా తనిఖీ చేశారు. అతడి వద్ద లభించిన 1.102 కిలోల ఎండు గంజాయి, ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.



కల్హేర్, మార్డి రహదారిలో కమ్ముకున్న పొగమంచు

వింటర్.. వ్యాధులు ఎంటర్!

● ఉదయం వేళల్లో మంచు

● రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

● వ్యాధులు ప్రబలే ఆవకాశం

● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

చిన్నకోడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం వేళల్లో మంచు కురుస్తూ, సాయంత్రం వేళల్లో చల్లని గాలులు విస్తుండటంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చలికాలంలో వ్యాదులు ప్రబలే అవకాశం ఉండటంతో పాటు, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాదులతో బాధపడుతున్న వారికి చలి తీవ్రత కారణంగా ఇబ్బందులు ఎదురవుతాయి. చిన్న పిల్లలు, వృద్ధులపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వివిధ రుగ్మతలు ఉన్నవారు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిసున్నారు.

ఇలా చేస్తే మేలు..

చలికాలంలో చర్మం తెల్లగా పొడిబారకుండా ఉండటానికి గ్లిజరిన్ సబ్బులను వాడితే, చర్మం మృదువుగా ఉంటుంది. వేడి నీటితో స్నానం చేస్తే చర్మం పొడిబారుతోంది. అందువల్ల గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. చలికాలంలో చర్మం పొడిబారడం, పాదాలు పగలడం ఎక్కువగా ఉంటుంది. గోరు వెచ్చని నీటితో కాళ్లు, చేతులు, పాదాలను శుభ్రంగా కడుక్కోని, పొడి గుడ్డతో శుభ్రంగా తుడిచి వ్యాజిలిన్, చర్మ క్రిములు రాసుకోవాలి. చలికి పెదాలు పగిలి రక్తం కారకుండా పెదాలకు వ్యాజిలిన్, లిప్‌బామ్ రాసుకోవాలి.



చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

చిన్న పిల్లలు, వృద్ధులపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో పిల్లల్లో నూమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చలి నుంచి రక్షణ కోసం వెచ్చటి దుస్తులను (స్వెటర్లు) తొడగాలి, వేడినీటితో స్నానం చేయించాలి. ఇంటి సరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. చలికాలంలో ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిది.

ఉన్ని దుస్తులు ధరించాలి..

చలికాలంలో ఉదయం, రాత్రి వేళల్లో పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఉన్ని దుస్తులు ధరించాలి. బైక్‌పై వెళ్లేవారు చేతులకు గ్లౌజ్‌లు, మంకీ క్యాప్, కాళ్లకు షూ ధరించాలి.

ఆస్తమా, గుండె జబ్బులు ఉంటే...

చలికాలంలో ఆస్తమా ఉన్నవారు నిత్యం వాడే మందులను సిద్ధంగా ఉంచుకోవాలి. దుమ్ము, దూళి పనులకు దూరంగా ఉండాలి. చల్లని వాతావరణంలో బయట తిరగకూడదు. వైద్యుల సలహల మేరకు మందులు వాడాలి. ఇన్‌హేలర్, నెబ్యులైజర్ అందుబాటులో ఉంచుకోవాలి. గుండె జబ్బులు ఉన్న వారు, గుండె ఆపరేషన్ చేసుకున్నవారు చలి కాలంలో వాకింగ్ చేయకూడదు. చలిలో ఎక్కువగా తిరిగితే గుండెకు సంబంధించిన సమస్యలు వస్తాయి. బీపీ, షుగర్ ఉన్నవారు కూడ జాగ్రత్తలు పాటిస్తే మంచిది.

నిమోనియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చలికాలంలో పిల్లలలో నిమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు చలి ప్రభావానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న పిల్లలు, వృద్ధులు చలిలో బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. గోరు వెచ్చని నీటిని తాగాలి. చల్లని పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండాలి. ఉన్ని దుస్తులను ధరించాలి. ఉదయం సాయంత్రం వేళలో బయట తిరగకపోవడం మంచిది.

-డాక్టర్ ప్రియాంక, పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు

రాష్ట్రస్థాయి క్రీడలకు దుబ్బాక విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దుబ్బాక విద్యార్థులు

దుబ్బాక/మిరుదొడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల విద్యార్థులు కిరణ్ కబడ్డీ, చెస్‌లో హర్షవర్ధన్, అథ్లెటిక్‌లో అరవింద్, షాట్‌పుట్‌లో నరేలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో వారు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను, పీఈటీ మహేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. మిరుదొడ్డి ఆదర్శ పాఠశాల విద్యార్థిని రిచా అండర్ 19 హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ అర్చనప్రియదర్శిని, పీఈటీ దేవరాజు అభినందించారు.

పొడిచన్‌పల్లి నుంచీ..

పాపన్నపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాపన్నపేట మండల పరిధిలోని పొడిచన్‌పల్లి పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. సంగారెడ్డిలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో నవ్యశ్రీ ప్రతిభ చూపి ఖమ్మంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. హుస్నాబాద్‌లో జరిగిన మెదక్ ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్స్‌లో వంశీ, అక్షయ ఉత్తమ ప్రతిభ కనబరిచి సిద్దిపేట జిల్లాలో జరుగబోయే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.

స్వయం ఉపాధి కోర్సుల విస్తరణ

● ఆసక్తి గల ఇన్‌స్ట్రక్టర్‌లు దరఖాస్తు చేసుకోవాలి

● సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



భవనాన్ని పరిశీలిస్తున్న సెట్విన్ కార్పొరేషన్ ఎండీ వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత కోసం సెట్విన్ ఆధ్వర్యంలో కల్పిస్తున్న ఉపాధి కల్పన కోర్సులను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నామని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ పరిధిలోని స్వయం ఉపాధి భవనాన్ని సెట్విన్ కార్పొరేషన్ ఎండీ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ ఆధ్వర్యంలో 23 స్వయం ఉపాధి కోర్సుల కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణను ఇస్తున్నామన్నారు. త్వరలో మరో ఐదు జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 17న జడ్చర్ల, 25న జహీరాబాద్‌లో సెంటర్‌లను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఐదు రకాల కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, అందుకోసం ఐదుగురు ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించనున్నామని వివరించారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని వారు సూచించారు. జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసే శిక్షణ కేంద్రంలో బ్యూటీషియన్, ఫ్యాషన్‌డిజైన్, కంప్యూటర్, ఆర్‌అండ్ ఏసీ, మొబైల్ సర్వీసింగ్, సీసీ కెమెరాలకు సంబంధించి కోర్సులను ప్రవేశపెడుతామన్నారు. జహీరాబాద్ ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్‌గా మారనున్నందున అదనంగా కోర్సులను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. వారి వెంట నాయకులు గుండారెడ్డి తదితరులు ఉన్నారు.

కులగణనను పకడ్బందీగా నిర్వహించాలి

సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్ మనోజ్

జోగిపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లను ట్రైనీ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని డాకూరు గ్రామంలో కొనసాగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి ఆయా ఇళ్లల్లోని ప్రతీ వ్యక్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. చాలామంది గ్రామీణులకు కులగణనపై అవగాహన ఉండకపోవచ్చని, ఈనేపథ్యంలో తగినంత సమయం తీసుకుని వివరించి, సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. ఇది భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమమైనందున, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆషామాషీగా తీసుకోవద్దని, కాలక్షేపంగా పని చేయొద్దని ఆదేశించారు. సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి గీత, ఎంపీడీవో రాజేశ్, ఎంపీవో అశోక్, పంచాయతీ కార్యదర్శి నర్సింహాగౌడ్ తదితరులున్నారు.

సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నారాయణఖేడ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండలం నాన్యానాయక్ తండాలో గురువారం సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

బొడిగరాళ్ల మొరం.. నాసిరకం మట్టి

● ఎన్‌హెచ్161బీ విస్తరణలో నాణ్యతకు తిలోదకాలు

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ



బొడిగ రాళ్లతో చదును చేసిన రోడ్డు, తవ్విన చోట నల్లమట్టి



నారాయణఖేడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అకోలా-హైదరాబాద్ 161 జాతీయ రహదారిపైగల నిజాంపేట నుంచి నారాయణఖేడ్‌మీదుగా బీదర్ వరకు ప్రభుత్వం 161బీ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నది. రూ.518కోట్ల వ్యయంతో దాదాపు 46 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా మార్చుతున్నారు. ఆరు నెలల క్రితం పనులు ప్రారంభంకాగా, ప్రస్తుతం పుల్‌కుర్తి నుంచి మనూరు మీదుగా నారాయణఖేడ్ వరకు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అవసరాన్ని బట్టి రోడ్డుకు ఇరువైపులా 2 నుంచి 6 ఫీట్ల వరకు తవ్వించి మొరంతో లెవలింగ్ పనులు చేపడుతున్నారు. ఇక్కడ అసలే నల్లమట్టి భూములు.. ఏ మాత్రం వర్షం కురిసినా కుంగిపోతుంటాయి. ఈ నేపథ్యంలో నాణ్యమైన మెటీరియల్‌ను వాడాల్సిన కాంట్రాక్టర్లు బొడిగ రాళ్లు, నాసిరకమైన మట్టిని వినియోగిస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై నేషనల్ హైవే డిప్యూటీ ఈఈ రామక్రిష్ణను సంప్రదించగా రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత లోపిస్తే సహించబోమన్నారు. 75 ఎంఎంకు మించి రాళ్లు ఉంటే తొలగింపజేస్తామని, క్వాలిటీ అథారిటీ అధికారులతో తనిఖీలు చేయించి చర్యలు చేపడతామన్నారు. రోడ్డు నిర్మాణం తరువాత ఐదేళ్ల వరకు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దేనని తెలిపారు.



ఖేడ్- బీదర్ జాతీయ రహదారి విస్తరణకు వినియోగిస్తున్న బొడిగ రాళ్ల మొరం

మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



ర్యాకల చంద్రాగౌడ్ (ఫైల్)

మనోహరాబాద్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యాసిడ్ తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిపల్లి గ్రామానికి చెందిన ర్యాకల చంద్రాగౌడ్(63) గ్రామ శివారులోని ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. మంగళవారం ఇంటికి తాగి వచ్చిన చంద్రాగౌడ్ మద్యం మత్తులో బాత్‌రూంలో ఉన్న యాసిడ్‌ను తాగాడు. వాంతులు చేసుకోవడంతో కుటుంబీకులు గమనించి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి, అక్కడి నుంచి హైదారాబాద్ ఈఎస్ఐ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయత్రం చనిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం బంధువు కృష్ణకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రిన్సిపాల్ దుర్మరణం



అర్చన (ఫైల్)

మునిపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా గ్రామంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.అర్చన(36) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకున్నది. మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ ప్రాంతానికి చెందిన సి.అర్చన స్థానిక మహిళ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజు మాదిరిగానే ప్రిన్సిపాల్ అర్చన బుధవారం బీహెచ్‌ఈఎల్ నుంచి తన కారులో కళాశాలకు వచ్చి విధులు ముగించుకుని అదే రోజు సాయంత్రం తన కారులో తోటి ఉద్యోగిని వీణ(35)తో కలిసి బీహెచ్‌ఈఎల్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ప్రిన్సిపాల్ అర్చన, సహచర ఉద్యోగిని వీణ తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది గాయాలపాలైన అర్చన, వీణను మెరుగైన చికిత్స నిమిత్తం సదాశివపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఆసుపత్రి వర్గాల సూచన మేరకు ప్రిన్సిపాల్ అర్చనను హైదారాబాద్ లింగంపల్లిలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ప్రిన్సిపాల్ అర్చన గురువారం సాయంత్రం మృతి చెందినట్టు ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. మృతురాలు ప్రిన్సిపాల్ అర్చన భర్త ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు..

మిరుదొడ్డి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గురువారం మిరుదొడ్డిలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన కనకరాజు(40) పని నిమిత్తం అల్వాల్ గ్రామానికి బైక్‌పై వెళుతుండగా మిరుదొడ్డి చెరువుకట్ట వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు కనకరాజును కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్టు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

● మహిళకు తీవ్రగాయాలు

కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక శివారులోని వేద స్కూల్ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం సిరిసనగండ్లకు చెందిన సముద్రాల ఆంజనేయులు, రేణుక భార్యాభర్తలు. వారు విశ్వనాథపల్లిలో కూలీ పని ముగించుకుని తిరిగి కొండపాక మీదుగా గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో రాజీవ్ రహదారి నుంచి కొండపాక వైపు అతివేగంగా వెళ్తున్న లారీ ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్నవారు కింద పడడంతో రేణుకకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రేణుక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో వృక్షశాస్త్ర బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వృక్షశాస్త్రం బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వృక్షశాస్త్రం బోధించుటకు పీజీతో పాటు బీఈడీ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు ఈ నెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు నెం. 9000997100 సంప్రదించగలరని సూచించారు.

సీపీఎం మండల మహాసభ

దుబ్బాక, నవంబరు 7: మండల కేంద్రమైన దుబ్బాకలో గురువారం సీపీఎం మండల మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి హాజరై ఆపార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, సాదిక్, భాస్కర్ తదితరులున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొగుట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా నేడు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు చందాపూర్, రాంపూర్, వెంకట్రావుపేట, లింగాపూర్, ఎల్ బంజరుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి)7: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన సంపతి శ్రవణ్ కుమార్ (35) గతంలో అనుమతులు లేకుండా ఇంటికి విద్యుత్ వాడుతుండగా అధికారలు పట్టుకుని కేసు నమోదు చేయించారు. ఈ విషయంలో కోర్టు సమాన్లు పంపిన హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చింది. విద్యుత్ అధికారులు రెండవ సారి గురువారం దాడి చేయగా మళ్లీ అనుమతులు లేకుండా కరెంట్ వాడుతున్నాడు. దీంతో అతడిని కోర్టు ఎదుట హాజరుపరచగా మొదటి సెషన్స్ జడ్జి 15 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు, ఇన్‌స్పెక్టర్ ఆప్ పోలీస్, విజిలెన్స్ బృందం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళ్ళకల్ ఏఈ కృష్ణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లపై గొడ్డలి వేటు

- అక్రమంగా నరికివేస్తున్న వైనం
- బొగ్గుల తయారీకి, ఇటుక బట్టీలకు, సామిల్లులకు తరలుతున్న కలప
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప

అక్కన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. నరికి వేసిన చెట్లను అక్రమార్కులు ఇటుక బట్టీలకు, బొగ్గుల తయారీకి, సామిల్లులకు తరలిస్తున్నారు. పెద్ద పెద్ద వృక్షాలను నరికి తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, మద్దూర్, దూళిమిట్ట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో దర్జాగా చెట్లను నరికి అక్రమార్కులు లారీలు, డీసీఎం వ్యాన్లు, ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో కలప వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. ఓవైపు ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి మొక్కలను నాటుతుంటే కాపాడాల్సిన అధికారులే మామూళ్లు తీసుకుంటూ అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా చెట్లను నరికి వేసి అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని, తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తూ సీజ్ చేసిన వాహనాలను వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చెట్లు నరికి తరలించాలంటే అటవీశాఖ అనుమతులతోపాటు, తహసీల్దార్ కార్యాలయంలో చలాన్ కట్టి, గ్రామ పంచాయతీల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోకుండా కలప వ్యాపారులు చెట్లను నరికి వేస్తూ అక్రమంగా రవాణా చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. రైతులు కూడా తమ పొలాల్లోని చెట్లను నరకాలంటే తహసీల్దార్ కార్యాలయంలో చలన్ కట్టడంతో పాటు నరికిన చెట్ల స్థానంలో మొక్కలు నాటాలని నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యాపారులు చెట్లను నరికించి ఇటుక బట్టీలకు, బొగ్గుల తయారీకి, సామిళ్ల మిల్లులకు అక్రమంగా వాహనాల్లో తరలించడం నిరంతరం జరుగుతూనే ఉంది. సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెట్లను నరకకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

చర్యలు తీసుకోవాలి



చెట్లను అనుమతులు లేకుండా నరికి వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నరికి వేసిన కలపను ఇటుక బట్టీలకు, బొగ్గుల తయారీకి, సామిల్లులకు అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- జనగామ వేణుగోపాల్‌రావు, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్, అక్కన్నపేట

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్


బెజ్జంకి: రేగులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

బెజ్జంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మండలంలోని రేగులపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య, డీఎస్‌వో తనుజతో కలిసి గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యం తరలింపు, ట్యాబ్ ఎంట్రీ, ఏర్పాటు చేసిన వసతులను ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ డీఎం ప్రవీణ్, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో మంజుల, సూపరింటెండెంట్ అంజయ్య, ఐకేపీ సీసీ సారయ్య, ఏఈవో తేజస్వి, వీవోఏ నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

● చిన్నకోడూరు: తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. మండలంలోని పెద్దకోడూరు, ఇబ్రహీంనగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీఎస్‌వో తనూజ, డీఎం ప్రవీణ్, ఏపీఎం అంజనేయులు, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట రూరల్: సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్, అర్బన్ మండలం గాడిచేర్లపల్లి, బూర్గుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పరమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ కమలాకర్ రావు,గోపని మల్లేశం, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, సీఈవో కృష్ణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్ రూరల్: కొడకండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రెడ్డి, కొడకండ్ల వ్యవసాయ విస్తరణ అధికారి నర్సింహులు, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ అంజియాదవ్, పీఏసీఎస్ మెంబర్స్, పీఏసీఎస్ కొడకండ్ల ఇన్‌చార్జి అంజి, మేకల నర్సింహులు, తలారి అంజయ్య, తలారి కనకయ్య, అక్కారం ప్రసాద్, శేఖర్, అనిల్, ఓంకార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి



కార్తీక దీపోత్సవంలో భాగంగా కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని ముఖమండపంలో కార్తీక దీపోత్సవం ఆకారంలో జ్యోతులు వెలిగిస్తున్న భక్తులు

- చేర్యాల

ఆవాలతో సీఎం చిత్రపటం


చిత్రాన్ని చూపుతున్న సర్దార్‌ఖాన్

గజ్వేల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రామకోటి రామరాజు చిత్రించిన సీఎం చిత్రం అద్భుతమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రామకోటి రామరాజు ఆయన కార్యాలయంలో సీఎం చిత్రాన్ని ఆవాలతో చిత్రించారు.

టాలెంట్ టెస్ట్ ద్వారా సైన్స్‌పై ఆసక్తి

- దుద్దెడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి


కొండపాక: టాలెంట్ టెస్ట్ పేపర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందని దుద్దెడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి అన్నారు. పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా పదోతరగతిలో టీ. నిఖిత, తొమ్మిదో తరగతిలో వి. ప్రణీత, ఎనిమిదో తరగతిలో సీహెచ్.సృజన్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదగిరి, టాలెంట్ టెస్ట్ పాఠశాల కోఆర్డినేటర్స్ కె.హైమవతి, ఎస్.భాగ్యలక్ష్మి, జి.రజిని, ఉపాధ్యాయులు పి.యాదగిరి, జె.రజిని, ఎం.కిరణ్మయి, సీహెచ్. ఏసు మని, కే.శ్రీదేవి, పి.విజయలక్ష్మి, ఎస్.అనిల్ కుమార్, ఎస్.తిరుమల్‌రెడ్డి, సీహెచ్.మంజుల, ఎం.జానకి, పి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

● జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండలంలోని అన్ని పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహించామని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తుమ్మ సత్యం తెలిపారు. సైన్స్ ప్రచారాన్ని ముమ్మరం చేయాలని ఇందుకోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు. పాఠశాలల్లో సెలెక్ట్ అయిన విద్యార్థులను మండల స్థాయిలో నవంబరు 21న నిర్వహించే పరీక్షలో పాల్గొనాలని సూచించారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన

చేర్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు షైనగల్ల రాహుల్, కార్యదర్శి తాడూరి భరత్ మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ కోసం తొమ్మిదేళ్లుగా ప్రజాస్వామ్యయుతంగా పోరాటం నిర్వహిస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టి తీరని అన్యాయం చేకూర్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజయ్, అఖిల్, నరేశ్, రాజు, విక్రమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం'

జగదేవ్‌పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగులో సరైన మెళకువలు పాటించి లబ్ధిపొందాలని హార్టికల్చర్ అధికారి సౌమ్య, మండల వ్యవసాయ అధికారి వసంతరావు పేర్కొన్నారు. మండలంలోని చాట్లపల్లిలో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగులో ఖర్చు చాలా తక్కువని, కూలీల అవసరం చాలా వరకు తగ్గుతుందన్నారు. అనంతరం ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారి విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

తేమ పేరుతో మోసం చేస్తున్నారు

- చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పందిల్లలో కాటన్ ఇండస్ట్రీయల్‌లో తేమ పేరిట రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ సీపీఐ నాయకులు గురువారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. పందిల్లకు చెందిన రఘుపతి అనే రైతు తన పత్తిని పందిల్ల కాటన్ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే తేమ పేరుతో పత్తిని తిరస్కరించినట్లు తెలిపారు. మిల్లు యజమాని రూ. 1500 తక్కువకు రైతు వద్ద పత్తిని కొనుగోలు చేయడం వల్ల రైతు నష్టపోయాడని ఆరోపించారు. అధికారులు స్పందించి మోసాలకు పాల్పడుతున్న కాటన్ ఇండస్ట్రీయల్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు

క్రీడాకారులకు మంత్రి 'పొన్నం' అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో నిర్వహించిన సౌత్ ఇండియా యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో పాల్గొని తిరిగి వచ్చిన హుస్నాబాద్ కబడ్డి క్లబ్ క్రీడాకారులకు గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువాకప్పి అభినందించారు. కబడ్డీ పోటీల్లో రాణిస్తున్న గడిపె సిద్ధు, ఎండీ అల్ఫాజ్‌లతో పాటు కబడ్డీ కోచ్ మడక క్రిష్ణను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


మాట్లాడుతున్న కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్

సిద్దిపేట టౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో 2వేల మంది నిరుపేద మహిళలకు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్ తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా దుస్తుల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు అత్తుఇమామ్, దరిపల్లి చంద్రం, గయాసుద్దీన్, నజ్జు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన మల్లన్న ఆలయాధికారులు


సీపీకి మల్లన్న ప్రసాదం అందజేస్తున్న ప్రధానార్చకుడు మల్లికార్జున్

చేర్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్ రెడ్డి, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు గురువారం సిద్దిపేట సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ సందర్శనార్థం తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రత చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. వారివెంట అదనపు డీసీపీ మల్లారెడ్డి, అర్చకులు మహదేవుని రవి, వీరేశలింగం తదితరులున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్


సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలిస్తున్న కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు వస్తున్న అధికారులకు పట్టణ ప్రజలు సహకరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. 34, 35 వార్డులో కుటుంబ సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లలకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. కుటుంబ పెద్దలు ఎవరు అందుబాటులో ఉంటే వారు ఇంటి సభ్యులకు సంబంధించిన వివరాలను తెలియపరచాలని సూచించారు. సర్వే చేసే ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉన్నారని, ఎన్యుమరేటర్లకు సందేహాలు నివృత్తి చేసేందుకు సర్వేను నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుడాల సంధ్యశ్రీకాంత్, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కథల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


శ్రావణి


రష్మిత

కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన కథల పోటీల్లో కొండపాక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని విజేతగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్‌నాయక్ తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. నవంబరు 15న హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించే బాలల సాంస్కృతికోత్సవంలో బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. విద్యార్థిని శ్రావణిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.విఠల్‌నాయక్, తెలుగు ఉపాధ్యాయురాలు జి.సత్యలక్ష్మి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ యాదలక్ష్మి అభినందించారు.

● సిద్దపేట రూరల్: నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని దుర్గం రష్మిత రాష్ట్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన కథ, కవిత పోటీల్లో విజేతగా నిలిచిందని ఎంఈవో గౌరిమోహన్ తెలిపారు. విద్యార్థిని రస్మితకు బహుమతి, ప్రశంసపత్రం అందజేసి, సన్మానించనున్నట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి, విద్యార్థిని రస్మితను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ


జగదేవ్‌పూర్‌లో యాంటీ క్యేన్సర్ ఆకారంలో విద్యార్థులు

జగదేవ్‌పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యేన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమం సందర్భంగా జగదేవ్‌పూర్‌లోని ఓ పాఠశాల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ తరువాత బస్‌స్టాండ్ నందు, గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో కులగణను స్వాగతిద్దాం-సామాజిక న్యాయాన్ని సాధిద్దాం అనే అంశంపై డీబీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టడం హర్షణీయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి తదితరులున్నారు.

ఏ రిజర్వేషన్ ఎటో!

5వ పేజీ తరువాయి..

చెరుకు ముత్యంరెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కుమారుడు సతీష్‌రెడ్డిలు ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగాలని భావిస్తున్నట్లు సమాచారం. రిజర్వేషన్ అనుకూలిస్తే జెడ్పీ చైర్మన్ పదవిని చేపట్టవచ్చనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని ఏదైనా ఓ మండలం నుంచి పోటీ చేయాలని రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌లో ఉండగా, జెడ్పీటీసీగా పోటీ చేయాలని భావించినా.. అప్పటి ఎమ్మెల్యే రామలింగారెడ్డి అడ్డుకట్ట వేశారు. ప్రస్తుతం ఆయన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న నేపథ్యంలో జెడ్పీటీసీగా పోటీ చేసి.. జెడ్పీ చైర్మన్ కావాలని ఆశిస్తున్నట్లు సమాచారం. అలాగే, సోలిపేట సతీష్‌రెడ్డి సైతం తొగుట, దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో ఏదో ఒక చోట నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

కులగణన తేలితేనే..

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న కార్యకర్తలు స్థానిక ఎన్నికల ముంగిట స్తబ్ధంగా మారిపోయారు. జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేయాలనే ఆశావహులు మినహా, గ్రామస్థాయి నాయకులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఆయా గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్, వార్డ్ సభ్యుల రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాతే రంగంలోకి దిగుదామని, తొందరపడి వృథా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ఉద్దేశంతో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు ఇచ్చే పిలుపులకు, చేపట్టే కార్యక్రమాలకు గ్రామాల్లో స్పందన అంతంత మాత్రంగానే ఉంటుందని తెలుస్తోంది.